# జీవన సంధ్య

**- వాణిశ్రీ**

**ఉదయం ఎనిమిదైంది. మునిస్వామి "తులసీ, నేను బైటకెళ్తున్నాను. నాకు వంట చెయ్యకు"అని వెళ్ళిపోయాడు.**

అలా కొన్ని రోజుల్నుంచి ఉదయమే వెళ్ళిపోయి మళ్ళీ రాత్రి ఏ పదింటికో వస్తున్నాడు.

"తులసీ! నాన్న కనిపించడం లేదేం?" అని భార్యని అడిగాడు రామచంద్రమూర్తి.

"పనిమీద వెళ్తున్నానని చెప్పి వెళ్తున్నారండీ" అన్నది తులసి.

కొన్ని రోజుల తర్వాత భార్యని నిలదీశాడు రామచంద్రమూర్తి. "తులసీ! నాన్న, నువ్వు ఏదైనా పోట్లాడుకున్నారా?"

"అయ్యో! అటువంటిదేం లేదండీ." అన్నది.

"మరి నాన్న, రోజూ పొద్దున్నే వెళ్ళిపోయి, రాత్రికి ఇంటికి వస్తున్నాడు. ఇంట్లో భోజనం చెయ్యడం లేదు. ఏమిటిదంతా? నాకేం అర్థంకావడం లేదు" అన్నాడు.


"ఏమోనండీ నాకేం తెలుస్తుంది? మీ నాన్న ఈమధ్య మూడీగా వుంటున్నారు. ఎవరితోనైనా సంబంధం పెట్టుకున్నారో ఏమో?" అన్నది నవ్వుతూ.

"ఛీ... అవేం మాటలు?"

"నేను కానిమాట ఏమన్నాను? ఈ రోజుల్లో ఏదైనా సాధ్యమే. మగాడు స్త్రీతోడు లేకుండా వుండలేడంటారు. అసలు భార్య వుండగానే మరొక దాన్ని వెతుక్కుంటారు కొందరు. ఇక భార్య లేనివాళ్ళు ఎన్నాళ్ళు నిగ్రహించుకుంటారు?"

"ఏం మాటలవి? మా నాన్న వయసెంత?"

"ఎంతేమిటి? అర్వై నిండి వుంటాయి. ఈరోజుల్లో అదేమంత ఎక్కువ వయసు కాదు. జీవన ప్రమాణాలు పెరిగాయి. ఎనభై ఏళ్ళ తాతలు గూడా మళ్ళీ పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. మీరు పేపర్లు చదవరు, టి.వీ. చూడరు. ఏం తెలుస్తుంది?" అన్నది తులసి.



రామచంద్రమూర్తి అయోమయంగా భార్యవైపు చూశాడు. ఆమె మాటలు అతనికి ఆందోళన కలిగించాయి. తండ్రి ఒంటరితనంతో బాధపడుతున్నాడా? ఆడదానితోడు కోరుకుంటున్నాడా? ఎవరైనా తనలాంటి ఒంటరి స్త్రీకి ఈయన దగ్గరయ్యాడా? ఎలా తెలుస్తుంది?

అతని మనసులో రాంప్రభు బాబాయి మెదిలాడు. నాన్న, బాబాయి చిన్నతనంనుంచి కలిసి చదువుకున్నారు. వాళ్ళిద్దరి మధ్య దాపరికాలు ఏమీలేవు. తను రాంప్రభుని 'బాబాయి'అని పిలిచేవాడు. కులాలు వేరైనా అన్నదమ్ముల్లా అన్ని విషయాల్లోనూ చేదోడు వాదోడుగా వుండేవాళ్ళు. రాంప్రభు బాబాయి రైల్వేగార్డుగా పనిచేసి రిటైరయ్యాడు. మద్రాస్‌లో సెటిలయ్యాడు.

తండ్రి విషయం ఏమిటో బాబాయి ద్వారానే తెలుసుకోవాలని నిర్ణయించుకున్నాడు రామచంద్రమూర్తి.

❋ ❋ ❋

ఉదయం ఆరింటికి మునిస్వామి సింక్ ముందు నిల్చుని బ్రష్ చేసుకుంటూ వుండగా రామచంద్రమూర్తి వచ్చి "నాన్నా! రాంప్రభు బాబాయి చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌కి వస్తున్నానని ఫోన్ చేశాడు. స్టేషన్‌కి వెళ్ళి తీసుకొస్తాను" అన్నాడు.

మునిస్వామి తల వూపాడు. రాంప్రభు వచ్చేసరికి స్నానం చేసి రెడీగా వున్నాడు.

"ఏంట్రా హఠాత్తుగా వచ్చావు? హైదరాబాద్‌లో ఏదైనా ఫంక్షన్ వుందా?" అడిగాడు మునిస్వామి.

"అటువంటిదేం లేదురా! నీతోనే మాట్లాడాలని వచ్చాను" అన్నాడు రాంప్రభు.

"ఏమిటి విషయం?" అడిగాడు మునిస్వామి.

"నువ్వేంట్రా? పొద్దున్నే ఇంట్లోనుంచి వెళ్ళిపోయి మళ్ళీ రాత్రి పదింటికి వస్తున్నావట. ఇంట్లో భోజనం చెయ్యడం లేదట. ఏమిటి సంగతి? రాముకి ఏం అర్థం కాక నాకు చెప్పాడు. కనుక్కుందామని వచ్చాను."

"వడ్ల గింజలో బియ్యం గింజ. ఏం లేదు. రేపు నాతోరా. నేనేం చేస్తున్నానో స్వయంగా చూద్దువుగాని." అని నవ్వాడు మునిస్వామి.

❋ ❋ ❋

మర్నాడు ఉదయం మునిస్వామి, రాంప్రభుని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కి తీసుకెళ్ళాడు. టిక్కెట్లు జారీచేసే కౌంటర్ల దగ్గర జనం క్యూలో నిల్చుని టెన్షన్ పడుతున్నారు. ట్రైన్ దిగి వచ్చే జనం, ట్రైన్ బయల్దేరడానికి ఐదు నిమిషాల ముందు వచ్చి హడావుడిగా పరిగెత్తుతున్న వాళ్ళతో అక్కడంతా సందడిగా వుంది. మైక్‌లో రైళ్ళ రాకపోకల గురించి ఎనౌన్స్‌మెంట్లు వినిపిస్తున్నాయి. డిస్‌ప్లే బోర్డుమీద ట్రైన్ నెంబర్లు, అరైవల్, డిపార్చర్ టైము, ప్లాట్‌ఫారాల నెంబర్లు డిజిటల్ లెటర్స్ పడుతున్నాయి.

ఇద్దరూ చెరొక కుర్చీలో కూర్చున్నారు. మునిస్వామి ఏం చెప్తాడో వినాలని చూస్తున్నారు రాంప్రభు. అతను వచ్చేపోయే వాళ్ళని చూస్తున్నాడు. రెండు కుర్చీల అవతల కూర్చున్న అమ్మాయిని పరిశీలిస్తున్నాడు. ఆమెకు ఇర్వై ఏళ్ళలోపే వుంటాయి. చాలాసేపటి నుంచి మొబైల్ ఫోన్లో బటన్స్ నొక్కుతోంది. విసుగ్గా పెడుతోంది ముఖం. ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లుంది. మునిస్వామి ఆమె దగ్గరికెళ్ళి ఏదో మాట్లాడాడు. ఆమె ఇష్టం లేనట్లు ముఖం చిట్లించింది.

"నీకెందుకురా ఆమె విషయం. వెళ్ళి ఎందుకు విసిగిస్తావు?" అన్నాడు రాంప్రభు.

"ఏం లేదురా. ఆమెకు నేనేదైనా సహాయం చెయ్యగలనేమోనని. పాపం కొందరు సిటీకి మొదటిసారి వస్తారు. వెళ్ళాల్సిన చోటుకి ఎలా చేరాలో తెలీదు. అటువంటి వారికి సిటీ బస్ నెంబర్లు చెప్పి హెల్ప్ చేస్తుంటాను" అన్నాడు మునిస్వామి.

"నువ్విక్కడ గైడ్ పని చేస్తున్నావా?" అని నవ్వాడు రాంప్రభు.

ఇంతలో కొందరు వచ్చి ఆమెను కొట్టుకుంటూ లాక్కెళ్ళారు.

సంగతేమిటంటే ఆమెది ఖమ్మం. సరదా పడితే డ్యాన్స్ నేర్పించారు పేరెంట్స్. కాలేజీ మానేసి ఎవడో సినిమాల్లో చేర్పిస్తానని ఆశపెడితే ఇంట్లోనుంచి పారిపోయి వచ్చిందట. జనం అంతా తమాషా చూశారు.

"చూశావురా అమ్మాయిల వేలంవెర్రి. సినిమా స్టార్స్ అవ్వాలని ఇంట్లో చెప్పకుండా పారిపోయి వస్తున్నారు" అన్నాడు మునిస్వామి.

"ఇందులో కొత్త ఏముంది? తెలుగు సినిమాలు మెడ్రాస్‌లో తీస్తున్నప్పుడు ప్రతిరోజూ ఇటువంటి అమ్మాయిలు సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో దిగేవారు. ఆ వ్యామోహం అటువంటిది" అన్నాడు రాంప్రభు.

లంచ్ టైమ్‌కి స్టేషన్ ఎదురుగావున్న హోటల్లో భోంచేసి వచ్చి మళ్ళీ అక్కడే కూర్చున్నారు. సాయంకాలం నాలుగింటికి కాఫీ త్రాగారు.

"పొద్దున్నే వచ్చి రాత్రివరకు నువ్వు కాలక్షేపం చేసేది రైల్వేస్టేషన్లో అన్నమాట"అని నిట్టూర్చాడు రాంప్రభు.

"ఉహూ... ఒకరోజు ఈ స్టేషన్లో. ఇంకొకరోజు నాంపల్లి స్టేషను, మరొకరోజు కాచిగూడా, తర్వాత ఇమ్లిబన్ బస్‌స్టేషన్లో, మరొక రోజు పబ్లిక్ గార్డెన్... అలా

తిరుగుతూ వుంటాను. ఒక్కచోటైతే బోర్‌గా వుంటుంది" అన్నాడు మునిస్వామి నవ్వుతూ.

"ఇదేం పనిరా? రోజూ దేశదిమ్మరిలా ఇలా స్టేషన్లోను, బస్టాండ్లోనూ ఎలా కూర్చుంటున్నావు? విసుగు పుట్టడం లేదూ?" అడిగాడు రాంప్రభు.

"విసుగెందుకురా? ప్రతిరోజూ ఎందరో కొత్తకొత్త మనుషుల్ని చూస్తుంటాను. వింత వింత సంఘటనలు జరుగుతుంటాయి. విచిత్రమైన వ్యక్తులు తారసపడతారు. జీవన నాటకంలో వింత వింత పాత్రధారులు నాకు కొత్తగా పరిచయమవుతూ వుంటారు. ఈ సజీవ దృశ్యాలు నాకు ఎంతో ఆనందాన్నిస్తాయి. హాయిగా వుంటుంది మనసు" చెప్పాడు మునిస్వామి.

"అదంతా సరే! రోజూ హోటల్లో భోజనం ఎలా సహిస్తుంది నీకు?"

"సహించక ఏం చేస్తుందిరా? జీవితమంతా రుచికరమైన పదార్థాలు తినాలంటే కుదుర్తుందా? తల్లిచచ్చిన జిహ్వ చచ్చును అన్నారు. మనకి ఏవి రుచిగా వుంటాయో తల్లికి మాత్రమే తెలుస్తుంది. ఆ తర్వాత కొంతవరకు ఆ లోటు భార్య తీరుస్తుంది. భార్య పోయిన నాలాంటి వారు రుచులకోసం పాకులాడడం అత్యాశ అవుతుంది" అన్నాడు మునిస్వామి.

"అవేం మాటలు రా? కోడలు చేసిపెట్టదూ?" అన్నాడు రాంప్రభు.

"కోడలికి ఎలా కుదురుతుందిరా? పాపం ఎన్నని చేస్తుంది? పిల్లల్ని ఎనిమిదింటికంతా రెడీ చేసి, బాక్సులు సర్ది పంపాలి. తర్వాత అబ్బాయి ఆఫీసుకెళ్ళే సమయానికి లంచ్ బాక్సు తయారుచేయాలి. ఇంట్లో ఎన్నో పనులుంటాయి. మనం ఖాళీగా కూర్చుని అది చెయ్యి, ఇది చెయ్యి అని ఇబ్బంది పెడితే ఎలా? అర్థం చేసుకోవాలి గాని." అన్నాడు మునిస్వామి.

"నీకు ప్రత్యేకంగా చేసేదేమిటి? వాళ్ళు చేసుకున్నదే నువ్వు తింటావు" అన్నాడు రాంప్రభు.

"సర్లేరా! ఎవరి పిచ్చి వాళ్ళకి ఆనందం అని వినలేదూ? పద... పద..." అని లేచాడు మునిస్వామి.

రాత్రి ఎనిమిదింటికి ఇద్దరూ సుబ్బయ్య మెస్‌కి చేరుకున్నారు.

"ఇదేంట్రా? ఇంటి దగ్గరికొచ్చి మెస్‌కి తీసుకొచ్చావు. పగలంతా ఎలాగో హోటల్లో తింటున్నారు. రాత్రి తిన్నదైనా ఇంట్లో చెయ్యవచ్చుగా?" అడిగాడు రాంప్రభు.

"నేను రాత్రిళ్ళు భోజనం మానేసి చాలా కాలమైంది. సుబ్బయ్య బాగా తెలిసినవాడు. నాకు ప్రత్యేకంగా ఉప్పు తక్కువ వేసిన కూర, పుల్కాలు చేసి పెడతాడు. ఇవన్నీ కోడలికి ఎలా వీలవుతాయి చెప్పు" అన్నాడు మునిస్వామి.

సుబ్బయ్య మునిస్వామికి ప్రత్యేకంగా డిష్‌లో పుల్కాలు, కూర తెచ్చి పెట్టాడు. అక్కడే రాంప్రభు భోజనం చేశాడు.

మునిస్వామి ఇంటికి దారితీస్తుండగా, రాంప్రభు "కాసేపు పార్కులో కూర్చుందాం" అన్నాడు.

ఇద్దరూ మున్సిపల్ పార్కులోకెళ్ళి సిమెంట్ బెంచీల మీద కూర్చున్నారు. పార్కులో జనం పెద్దగా లేరు. చాలా వరకు లైట్లు వెలగడం లేదు. చీకటిగా వుంది.

"ఒరేయ్ రాము ఫోన్‌చేసి నువ్వు విచిత్రంగా ప్రవర్తిస్తున్నావనీ, పొద్దున పోయి మళ్ళీ ఏ రాత్రికో ఇంటికి చేరుతున్నావనీ, ఏదో దాస్తున్నావనీ, ఎందుకో బాధ పడుతున్నావనీ అనుమాన పడ్డాడు. నిన్ను సూటిగా అడగలేక విషయం ఏమిటో తెలుసుకోమని నన్ను అడిగాడు. అందుకే వచ్చాను" అన్నాడు రాంప్రభు.

"నేను దాచింది ఏవుంది? అంతా నువ్వు చూశావుగా. అదే చెప్పు వాడికి" అని పేలవంగా నవ్వాడు మునిస్వామి.

రాంప్రభు సీరియస్‌గా చూశాడు.

"నేను ఏ పక్కింటి వాడినో అయితే అలాగే చెప్పేవాడిని. ఒరేయ్ నువ్వు ఎందుకో నాకు అసలు విషయం చెప్పడం లేదు. ఏదో దాస్తున్నావు" అన్నాడు రాంప్రభు.

మునిస్వామి జవాబు చెప్పలేదు.

కొంచెంసేపు మౌనం వహించాడు.

"మునీ! నీ గురించి నీకంటే నాకే బాగా తెలుసు. నువ్వు అంత తొందరగా బైటపడవు. నీలోనే కుళ్ళి, కుమిలి పోతుంటావు. నిజం చెప్పు. ఇంట్లో వుండకుండా ఎక్కడెక్కడో తిరుగుతున్నావంటేనే తెలిసిపోతోంది ఏదో ప్రాబ్లమ్ వుందని. ఎవరికీ చెప్పకుండా వుంటే ఏ సమస్యయినా పరిష్కారం కాదు. మనం ఒక తల్లి పిల్లలం కాకపోయినా అన్నదమ్ముల్లా పెరిగాం. నాకుగూడా చెప్పగూడదనుకుంటే నీ ఇష్టం." నిష్ఠూరంగా అన్నాడు రాంప్రభు.

మునిస్వామి కదిలిపోయాడు. ఉద్వేగం ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చాడు. కాసేపటికి తేరుకున్నాడు.

"గత కొంతకాలంనుంచి కోడలి ప్రవర్తనలో చాలా మార్పు వచ్చిందిరా. నాకు పెట్టే పదార్థాలలో ఉప్పు, కారం వుండేది కాదు. స్నానానికి నీళ్ళు కాచి బకెట్లో పోసేది. చన్నీళ్ళు పోయగానే చల్లబడి పోయేవి. గోరువెచ్చగా గూడా వుండేవి కాదు. కాఫీలో బెల్లం వేసేది. పానకంలా వుండేది. ఎలాగో సహిస్తున్నాను. కావాలని నన్ను ఎందుకు ఇబ్బంది పెడుతున్నదో ఎంత ఆలోచించినా అర్థంకాలేదు. ఒక రోజు నాకు భయంకరమైన నిజం తెలిసింది. మా కోడలు వాళ్ళింట్లో ఒక్కతే కూతురు. ఆమె అన్న అమెరికాలో స్థిరపడ్డాడు. కోడలు తండ్రి చనిపోయాడు. తల్లి ఒంటరిదైంది. ఆమెకు ఒంటరి జీవితం దుర్భరమైంది. కూతురు దగ్గర వుండి స్థిరపడాలని కోరిక. కాని ఎలా? నేను వుండగా వీలుకాదని అనుకున్నారు. వాళ్ళకి అడ్డంకిగా మారాను. ఇంట్లో నేను లేకుండా పోతే కోడలు తన తల్లిని తెచ్చుకుని వుంచుకోడానికి, మా అబ్బాయి గూడా అభ్యంతరపెట్టడు. పెద్ద దిక్కుగా వుంటుందని సమాధాన పడతాడు. కాని నన్ను బైటకు ఎలా పంపాలి? నాకు వీడు ఒక్కడే కొడుకు గదా! ఎలాగైనా నన్ను ఇంట్లోనుంచి నెట్టెయ్యడానికి మా వియ్యపురాలు దుర్మార్గమైన పథకం కూతురికి చెప్పింది" అని ఆగాడు మునిస్వామి.

రాంప్రభు ఆశ్చర్యంతో వింటున్నాడు.

"అంతే! కన్న తండ్రిని ఏ కొడుకైనా సరైన కారణం లేకుండా ఇంట్లోనుంచి వెళ్ళిపొమ్మని చెప్పలేడుగా! అందుకని మా వియ్యపురాలు కూతురుకిచ్చిన సలహా ఏమిటో తెలుసా? ఒక మంచి సమయం చూసి 'మావయ్యకు మదపిచ్చి ఎక్కిందండీ. కూతురులాంటి నన్ను పట్టుకుని మానభంగం చెయ్యబోయాడు' అని రాముకి ఏడుస్తూ చెప్పమంది" అని చెప్పి మునిస్వామి తల వంచుకున్నాడు.

కాలం స్థంభించినట్లయింది రాంప్రభుకి. వింటుంటేనే జుగుప్సాకరంగా, పరమ అసహ్యంగా వుంది. కడుపులో తిప్పినట్లయింది.



మునీ! నీ గురించి నీకంటే నాకే బాగా తెలుసు. నువ్వు అంత తొందరగా బైటపడవు. నీలోనే కుళ్ళి, కుమిలి పోతుంటావు. నిజం చెప్పు. ఇంట్లో వుండకుండా ఎక్కడెక్కడో తిరుగుతున్నావంటేనే తెలిసిపోతోంది ఏదో ప్రాబ్లమ్ వుందని. ఎవరికీ చెప్పకుండా వుంటే ఏ సమస్యయినా పరిష్కారం కాదు.

"ఇదంతా నీకెలా తెలిసింది?" అడిగాడు.

మా పనిమనిషి అమాయకురాలు. కల్లాకపటం తెలియనిది. అది విని నాకు చెప్పింది. "అయ్యగారూ! అబ్బాయిగారు లేనప్పుడు ఇంట్లో వుండకండి ఎందుకైనా మంచిది" అని సలహా ఇచ్చింది.

రాంప్రభు, మునిస్వామి భుజంతట్టి ఆప్యాయంగా నిమిరాడు.

"నాకు కోడలు ప్రవర్తనకు అర్థం అప్పుడు తెలిసింది. నిజంగా వాళ్ళ పథకం అమలుపరిచి వుంటే, ఆ కుట్రకు బలై నేను ప్రాణాలతో జీవించగలనా? నాకు జీవితంమీద విరక్తి కలిగింది. నాపై అటువంటి అపనింద వేసి, కొడుకుతో నన్ను ఇంట్లోనుంచి గెంటివేసే దృశ్యం భయంకరంగా కనిపిస్తోందిరా! నా వేలితోనే నా కన్ను పొడవాలని ఎత్తులు వేశారా! భయంతో వణికిపోతున్నానా! రాము లేనప్పుడు ఇంట్లో వుండడం ఎంత ప్రమాదమో తెలిశాక ఎలా వుండగలను? అందుకేరా దేశదిమ్మరిగా తిరుగుతున్నాను. అంతకంటే ఏంచేయాలి? ఎక్కడికి పోవాలి. ఏం చేయాలో తోచడం లేదురా!" కన్నీళ్ళు తుడుచుకుంటూ అన్నాడు మునిస్వామి.

రాంప్రభు నిట్టూర్చాడు. మునిస్వామి ఎటువంటి క్లిష్టమైన పరిస్థితుల్లో జీవిస్తున్నాడో అర్థమైంది.

"మానవ సంబంధాలు దిగజారాయనడానికి మీ కోడలు, వియ్యపురాలి దుష్ట పథకం పరాకాష్ఠ. నీ కోడలు చెప్పింది పచ్చి అబద్ధమనీ, అభాండాలనీ నువ్వెంత మొత్తుకున్నా ఆ సమయంలో ఎవరూ నమ్మరు. మోసం మాటలే తొందరగా నమ్మేస్తారు జనం. వాళ్ళు పన్నిన కుట్ర ఆ దేవుడే పనిమనిషి ద్వారా తెలిసేటట్లు చేశాడు. ఒక రకంగా అదృష్టవంతుడివే. లేకపోతే జీవితాంతం ఆ సంఘటన మాయని మచ్చలా మిగిలిపోయేది. బంధు, మిత్రులంతా నిన్ను చీడపురుగులా చూసేవాళ్ళు, ఎంతగానో అసహ్యించుకునేవాళ్ళు. కన్నకూతురు లాంటి కోడలిపై కన్నేసి అత్యాచారం చెయ్యబోయారని మొఖాన వుమ్మేసేవారు. చాలా ప్రమాదం నుంచి తప్పుకున్నావురా!" అన్నాడు రాంప్రభు.

మునిస్వామి తల వంచుకుని కూర్చుని వున్నాడు. అతని దుఃఖానికి అంతే లేదు.

"ఒరేయ్ ఇక నువ్వు ఆ ఇంట్లో ఒక్క క్షణం వుండొద్దు. కారణాలు ఏమైనా అంతా ఇప్పుడు వృద్ధాశ్రమాలలో గడపడానికి వెళ్ళిపోతున్నారు. సిటీలో వందలకొద్దీ ఆశ్రమాలు నడుస్తున్నాయి. మంచి ఆశ్రమం చూద్దాం. నిన్ను అందులో చేర్పించేదాకా నేను నీతోనే వుంటాను. అక్కడ అంతా మన వయసువారు , మనకంటే పెద్దవారు వుంటారు. ప్రశాంతంగా గడుస్తుంది. నువ్వు నీ అంతట ఇల్లు వదిలితే నీ కోడలి సమస్యా తీరుతుంది. పైగా సంతోషిస్తుంది. అప్పుడప్పుడూ నువ్వు ఇంటికెళ్ళి గడపొచ్చు. వాళ్ళూ నిన్ను చూడ్డానికి వస్తుంటారు. నీ ఆఖరి మజిలీ అదే. ఇక నువ్వు వర్రీ కాకు. సంతోషంగా వుండు" అని స్నేహితుడి భుజంమీద చెయ్యి వేశాడు రాంప్రభు.

మునిస్వామి అలాగేనని తల వూపాడు.

★